క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

నందిగామ: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం మధ్యాహ్నం 2గంటలకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఉంటుందని న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు హాజరయ్యే ఈ సదస్సుకు గ్రామస్తులు, విద్యార్థులు, యువకులు హాజరవ్వాలని సూచించారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

కొందుర్గు: మండల కేంద్రంలో శుక్రవారం పోచమ్మ దేవత బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటంతో ఉత్సవాలను ప్రారంభించారు. మహిళలు సాంప్రదాయ వస్త్రాలు ధరించి వేపకొమ్మలతో అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

శంకర్‌పల్లి: పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని, కుంకుమార్చన జరిపించారు. అనతరం ఒడిబియ్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొందుర్గు: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ అన్నారు. శుక్రవారం చౌదరిగూడ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, యూనియన్ నాయకులు శివ, జాకీర్, అల్తాఫ్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం అవసరం

షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు సహకరించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన నరేందర్, విఠలయ్యగౌడ్‌లు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, నోట్‌బుక్స్, వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అబేద్, కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయురాలు కవిత, గ్రామస్తులు వెంకటేశ్, ముక్తార్, సలీం, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులున్నారు.


హిందీ పండిట్‌ను సస్పెండ్ చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్

మొయినాబాద్: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హిందీ పండిట్ ప్రవీణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వెంకటాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడి తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. గతంలోనూ విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో షీటీం పోలీసులు కేసు నమోదు చేసి జరిమానా విధించినా అతనిలో మార్పు రాలేదన్నారు. డీఈఓ వెంటనే పాఠశాలను సందర్శించి జరిగిన ఘటనపై విచారణ జరపాలన్నారు. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విచారణ జరిపి అతన్ని విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఫేస్ రికగ్నేషన్‌తో పింఛన్ల పంపిణీ

పరిశీలించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య



పింఛన్ కోసం ముఖచిత్రం తీసుకుంటున్న కిష్టయ్య

కేశంపేట: వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, గీత కార్మికులకు అందిస్తున్న పింఛన్ల పంపిణీని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం ఆయన వేములనర్వ, కేశంపేట, సంగెం, పుట్టోనిగూడ గ్రామాల్లో ఫేస్ రికగ్నేషన్ ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటికే 70శాతం మందికి పింఛన్లు అందజేశామన్నారు. వేలిముద్ర, పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతోనూ పింఛన్లు అందించాలని బీపీఎంలకు సూచించారు. సెక్షన్ అసిస్టెంట్ జయప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- అధికారి, ఆపరేటర్ ఏ ఒక్కరూ లేకపోయినా నిలిచిపోతున్న రిజిస్ట్రేషన్లు
- నెలలు గడిచినా పూర్తికాని విరాసత్‌లు
- డిప్యూటేషన్లపై ఉద్యోగులు
- సతమతమవుతున్న సామాన్యులు



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం

కొందుర్గు: సరిపడ సిబ్బంది లేక కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో పనులకు ఆటంకం కలుగుతోంది. ఇక్కడ అధికారి సెలవు పెట్టినా, ఆపరేటర్ సెలవుపెట్టినా రిజిస్ట్రేషన్లు ఆగిపోవాల్సిందే. కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయి. భూముల క్రయవిక్రయాలు, విరాసత్‌లు, జీపీఏ, ఏజీపీఏ, మార్టిగేజి తదితర లావాదేవిలకు ప్రతిరోజు దాదాపు 15–20 వరకు స్లాట్లు బుక్‌చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో రెవెన్యూ సమకూరుతుంది. కానీ ఈ ప్రక్రియ పూర్తిచేయడానికి సమయానికి సిబ్బంది లేక రైతులు, భూములు కొనుగోలు చేసినవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గతంలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహించేవారు. 2023లో ఓ ఆపరేటర్‌ను షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఒకే ఆపరేటర్ ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆపరేటర్ సెలవుపెట్టినా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినా ఆరోజు రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి.

పట్టా మార్పిడికి నెల రోజులు

ఈ కార్యాలయంలో రాజశేఖర్, శివకుమార్ ఎంఆర్ఐలు ఉండాలి. ఇక్కడికి బదిలీపై వచ్చిన రాజశేఖర్ విధులకు హాజరవ్వడం లేదనే అపవాదు ఉంది. ఆయన మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. శివకుమార్‌కు ఇటీవలే పదోన్నతి లభించింది. దీంతో కార్యాలయంలో ఎంఆర్‌ఐ అనే అధికారి కరువయ్యారు. సాదారణంగా పట్టాదారు మరణిస్తే అతడి పేరున ఉన్న భూమిని వారసులు పట్టామార్పిడి చేసుకోవడం కోసం (విరాసతు) స్లాటు బుక్ చేస్తారు. పట్టాదారుకు సంబంధించిన వారసుల వివరాలు సరైనవేనా అంటూ ఎంఆర్ఐ గ్రామానికి వెళ్లి విచారణ చేసి పంచనామ సమర్పిస్తేనే వారసులకు పట్టా మార్పిడి జరుగుతుంది. ఈ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తిచేయాలి. కానీ ఎంఆర్ఐ లేకపోవడంతో నెలలు గడుస్తున్నా ఈ తతంగం పూర్తికావడం లేదు.

వందల సంఖ్యలో నిలిచిపోయిన దరఖాస్తులు

ఈ మండలంలో పనిచేసే సర్వేయర్ ఆంజనేయులు కొందుర్గుతోపాటు జిల్లేడ్‌చౌదరిగూడ, షాబాద్ మండలాల్లో అదనపు బాధ్యతలున్నాయి. దీంతో ఆయన వారంలో రెండు రోజులు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. దీనికి తోడు ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఆంజనేయులును 50 రోజుల పాటు శిక్షణ కోసమే పంపించారు. దీంతో భూముల కొలతల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు కార్యాలయం చుట్టూ తిరిగి విసిగెత్తుతున్నారు. ఇక్కడ గణాంకాధికారిగా జిల్లేడ్ చౌదరిగూడలో పనిచేసే సాయి పవన్ ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

అధికారులకు నివేదించాం



కార్యాలయంలో సరిపడ సిబ్బంది లేరు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. సిబ్బంది లేకపోవడం వల్లనే ధరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

– రమేశ్ కుమార్, తహసీల్దార్, కొందుర్గు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో సరిపడ సిబ్బంది లేని విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా. మరో ఐదు రోజుల్లో కార్యాలయానికి సిబ్బంది వచ్చేలా కృషి చేస్తా. కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గంలోని 62 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీర్లపల్లి శంకర్ బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తొలిప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. ఆర్థిక భారం కారణంగా అనారోగ్యంతో చితికిపోయిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలోని 62 మంది లబ్ధిదారులకు రూ.35.28లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ వివిధ మండలాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వీరేశ్, కృష్ణారెడ్డి, నర్సింలు, హరినాథ్‌రెడ్డి, రాజు, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు తిరుపతిరెడ్డి, రఘునాయక్, అశోక్, శ్రీనివాస్, సీతారాం, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాకేశ్‌రెడ్డి, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ముట్పూర్‌లో..

కొందుర్గు: మండల పరిధిలోని ముట్పూరు గ్రామానికి చెందిన కావలి సిద్దుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరయింది. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు పురుషోత్తం రెడ్డి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, అంజయ్య, జితేందర్, శివకుమార్, శ్రీను, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకా తప్పనిసరి



కాశీంబౌలిలో టీకా వేస్తున్న డాక్టర్ దేవీరెడ్డి

మొయినాబాద్‌రూరల్: జీవాలకు వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించినప్పుడే వాటికి ఎలాంటి రోగాలు దరిచేరవని పశువైద్యాధికారి దేవీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాశీంబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు నీలినాలిక వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవాలకు నీలినాలిక వ్యాధి సోకితే నోటి చుట్టూ పుండ్లు, నాలిక నీలం రంగులోకి మారడం, జలుబు, శ్వాసకోస సమస్యలు వస్తాయని చెప్పారు. వ్యాధి సోకితే మేకలు, గొర్రెలు తలకిందులుగా చుట్టూ తిరుగుతూ పడిపోవడం, గర్భస్రావం, మూత్రప్రసవాలు జరుగుతాయన్నారు. ఈ వ్యాధిని నివారించేందుకు ముందు జాగ్రత్తగా ప్రభుత్వం టీకా పంపిణీ చేస్తుందని వివరించారు. గొర్రెలు, మేకల రైతులు జీవాలకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో షీటీం కౌన్సెలింగ్

ప్రవీణ్‌కుమార్‌పై డీఈఓకు ఫిర్యాదు చేసిన ఎంఈఓ



వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

మొయినాబాద్: విద్యార్థినులను పరుష పదజాలంతో దుర్భాషలాడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడికి షీటీం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హిందీ పండిట్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థినితో అసభ్య కరంగా ప్రవర్తించి అడగడానికి వచ్చిన ఆమె తండ్రిపై చెప్పుతో దాడి చేయడానికి ప్రయత్నించిన ఘటనకు సబంధించి 'ఉపాధ్యాయుడి వక్రబుద్ధి'శీర్షికతో శుక్రవారం 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనానికి షీటీం పోలీసులు, విద్యాశాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం చేవెళ్ల డివిజన్ షీటీం ఎస్ఐ శ్యాంసుందర్ తన సిబ్బందితో కలిసి వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీటీం పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని చెప్పారు. విద్యార్థులను కొట్టడం, తిట్టడం చేయవద్దని.. ఏదైనా ఉంటే తల్లిదండ్రులకు, విద్యాధికారులకు చెప్పాలని సూచించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎం మల్లయ్య ప్రవీణ్‌కుమార్‌పై డీఈఓకు ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌ను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసుకుందామని పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో పలువురు ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు పృథ్వీరాజ్, ఆసీఫ్ ఉన్నారు. పార్టీలో చేరిన వారిలో చందు, తేజ, చరన్, శివ, అభి, చెర్రి, రేవంత్, ఆనంద్, విజయ్, రాహుల్, తదితరులు ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దవేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రఘుపతిరెడ్డి, రవి, మల్లేష్‌గౌడ్, యాదయ్య, రాఘవేందర్, సాయి, అంజిరెడ్డి, శ్రీధర్ తదితరులు అవినాశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను నట్టేట ముంచిందన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, నాయకులు అశోక్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, బాలరాజ్, ప్రసాద్, మాణిక్యంరెడ్డి, నరేశ్, రాజు తదితరులున్నారు.

ఏపీఎంల బాధ్యతల స్వీకరణ



షాద్‌నగర్ రూరల్: జయమాలినిని సన్మానిస్తున్న వీఓఏలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల మహిళా సమాఖ్య నూతన ఏపీఎంగా జయమాలిని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఫరూఖ్‌నగర్ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న నగేశ్ బదిలీపై సెర్ప్ కార్యాలయానికి వెళ్లారు. కొందుర్గు ఏపీఎంగా పని చేస్తున్న జయమాలిని బదిలీపై ఫరూఖ్‌నగర్ మహిళా సమాఖ్యకు వచ్చారు. నూతన ఏపీఎంగా బాధ్యతలను చేపట్టిన జయమాలినిని వీఓఏల యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి సులోచన, కోశాధికారి అలివేలు, అకౌంటెంట్, ఆపరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వీఓఏల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొయినుద్దీన్, మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాజునాయక్, లక్ష్మి, అమరావతి, లావణ్య, సుమిత్ర, మంజుల, శిరీష, స్వప్న, మహేశ్వరి, రేష్మ, శివాని, సరోజ, భవానీ, అనిత, లావణ్య, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో ఏపీఎం భగవంతు

నందిగామ: నందిగామ మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా భగవంతు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఏపీఎం భగవంతుకు బదిలీపై వెళ్తున్న ఏపీఎం యాదగిరి బాధ్యతలు అప్పగించారు. అనంతరం భగవంతు మాట్లాడుతూ.. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం సమాఖ్య సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిలోని బూర్గులలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 207, 209 బీజేపీ పోలింగ్ బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 207వ పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శులుగా జంగయ్య, శ్రీశైలం, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా రాజశేఖర్, లాబార్తి ప్రముఖ్‌గా రమేశ్, వాట్సాప్‌గ్రూప్ ప్రముఖ్‌గా వెంకటేశ్, నర్సింహ, బీఎల్‌ఏగా శేఖర్, 209వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శిగా యాదగిరిగౌడ్, లాబార్తి ప్రముఖ్‌గా హరీశ్వర్, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా కృష్ణ, వాట్సాప్‌గ్రూప్ ప్రముఖ్‌గా గిరి, బీఎల్‌ఏగా నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, మోహన్‌సింగ్, రఘుగౌడ్, సుధాకర్, హరీశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి దూరంగా పీహెచ్‌సీ

కొత్తూరు: పట్టణానికి దూరంగా ఉన్న కొత్తూరు పీహెచ్‌సీను పట్టణావాసంలోకి తరలించాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ హెల్త్ సెంటర్ ప్రస్తుతం నందిగామ మండలం చాకలిగుట్టతండాలో కొనసాగుతోందని దీంతో రోగులు, సిబ్బంది సైతం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆస్పత్రిని పట్టణ కేంద్రానికి తరలించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివయ్య



మాట్లాడుతున్న శివయ్య

షాద్‌నగర్‌రూరల్: న్యాయవాదులు మారుతున్న చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గంతల శివయ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు సముదాయ భవనంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, ప్రధాన క్యాదర్శి గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిమినల్ చట్టాలపై జూనియర్ న్యాయవాదులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరద్భంగా శివయ్య మాట్లాడుతూ.. ప్రతీరోజు కొత్త జడ్జిమెంట్లతో రూపాంతరం చెందుతూ నవీకరణ దిశగా న్యాయశాస్త్రాలు అడుగులు వేస్తున్నాయన్నారు. న్యాయశాస్త్రం ఒక సముద్రమని ఎంత చదివినా, ఎంత నేర్చుకున్నా తక్కువేనని అన్నారు. న్యాయవాదులు చట్టాలను పూర్తిగా అవపోసన పట్టాలని సూచించారు. నిత్యం మారుతున్న చట్టాలకు అనుగుణంగా న్యాయవాదులందరు ఆయా చట్టాలపై పూర్తి విజ్ఞానవంతులై ఉండాలని అన్నారు. కక్షదారులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే విధంగా న్యాయవాదులు కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మైక్రోబయాలజీ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకితే ప్రాణాలకే ప్రమాదం అన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ముందుగానే పసిగట్టి వైద్యులను సంప్రదించి చికిత్సను తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని అన్నారు. అనంతరం విద్యార్థినులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్‌జహాన్, కళాజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక రక్షాబంధన్



రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి లక్ష్మి

షాబాద్: మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా రక్షాబంధన్ అని షాబాద్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారి బీకే లక్ష్మి అన్నారు. శుక్రవారం షాబాద్, నాగర్‌గూడ గ్రామాలలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారిలు మంజుల, శకుంతల, శివకుమార్, రమేశ్, రాజయ్య, బస్వరాజ్, కృష్ణ తదితరులున్నారు.

రాజకీయ లక్షణాలను అలవర్చుకోవాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు రాజకీయ లక్షణాలను అలవర్చుకోవాలని ఏబీవీపీ మండల కార్యదర్శి బి.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ కళాశాలలో ఏబీవీపీ నూతన కమిటీని ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా శంషాబాద్ విభాగం కన్వీనర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. కళాశాలలో జూనియర్, డిగ్రీ విద్యార్థులు నూతన కమిటీ వేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, సంజయ్, భార్గవ్, రమేశ్, శ్రీనివాస్, ప్రేమ్, శివ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు పిచికారీలో జాగ్రత్త

షాబాద్: పత్తి పంటసాగులో పురుగు మందు పిచికారీలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్ ఏఓ కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడలో వెల్స్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రతినిధులు ఉదయభాను, గోవింద్ కుమార్ మౌర్య హాజరై పత్తి పంటలో పురుగు మందు పిచికారీ విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు, డ్రోన్ పిచికారీ డ్రోన్ దీదీ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గీత, వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ సురేఖ, పంచాయతీ కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, వెల్స్‌పన్ ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు తదితరులున్నారు.